శ్రీ దత్తాత్రేయ వజ్రకవచం

- భావార్థముతో -

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ దత్తాత్రేయ వజ్రకవచం - భావార్థముతో -

ఋషయో ఊచుః...

01. కథం సంకల్పసిద్ధిః స్యాద్ వేదవ్యాస కలౌయుగే।
ధర్మార్థకామ మోక్షాణాం సాధనం కిముదాహృతం॥

"వేదవ్యాసా! కలియుగంలో సంకల్పం ఎలాసిద్ధిస్తుంది? ధర్మార్థకామ మోక్ష సాధనమని దేనిని చెబుతారు?" అని ఋషులు అడిగారు.

- - - === - - -

వ్యాస ఉవాచ...

02. శృణ్వంతు ఋషయః సర్వే శీఘ్రం సంకల్పసాధనం।
సకృదుచ్చారమాత్రేణ భోగమోక్షప్రదాయకం॥

"ఋషులారా! తొందరగా సంకల్పాన్ని సిద్ధింప జేసేదీ, ఒక్కసారి చదివితే చాలు భోగమోక్షాలనిచ్చేదీ చెబుతాను అందరూ వినండి" అని వ్యాసుడన్నాడు.

- - - === - - -

03. గౌరీశృంగే హిమవతః కల్పవృక్షోపశోభితే।
దీప్తే దివ్యమహారత్న హేమమండపమధ్యగం॥

హిమవత్పర్వత గౌరీశృంగం మీద కల్పవృక్షాలతో శోభిస్తూ, మెరసిపోతున్న దివ్య మహారత్న ఖచితమైన హేమమండపం నడుమ..

- - - === - - -

04. రత్నసింహాసనాసినం ప్రసన్నం పరమేశ్వరం।
మందస్మిత ముఖాంభోజం శంకరం ప్రాహ పార్వతీ॥

పరమేశ్వరుడు రత్నసింహాసనం మీద కూర్చున్నాడు. ఆయన ప్రసన్నుడై ఉన్నాడు. ఆయన ముఖపద్మంపై చిరునవ్వు మెరుస్తున్నది. అట్టి శంకరునితో పార్వతీ దేవి..

- - - === - - -

శ్రీ దేవ్యువాచ...

05. దేవదేవ మహాదేవ లోకశంకర శంకర।
మంత్రజాలాని సర్వాణి యంత్రజాలాని కృత్స్న శః॥

దేవదేవా! మహాదేవా! లోకశంకరా! శంకరా! సర్వ మంత్రాలను, సమస్త యంత్రాలను..

- - - === - - -

06. తంత్రజాలాన్యనేకాని మయా త్వత్తః శ్రుతాని వై।
ఇదానీం ద్రష్టుమిచ్ఛామి విశేషేణ మహీతలం॥

అనేక తంత్రాలను నీవల్ల నేను విన్నాను. "ఇప్పుడు వాటినన్నింటిని విశేషించిమహీతలాన్ని చూడాలనుకొంటున్నాను" అని అన్నది.

- - - === - - -

07. ఇత్యుదీరితమాకర్ణ్య పార్వత్యా పరమేశ్వరః।
కరేణామృజ్య సంతోషాత్ పార్వతీం ప్రత్యభాషత॥

ఇలా పార్వతి పలికినది విని, పరమేశ్వరుడు సంతోషంతో ఆమెను ప్రేమగా చేతితో నిమురుతూ ఆమెతో ఇట్లన్నాడు.

- - - === - - -

08. మయేదానీం త్వయా సార్థం వృషమారుహ్య గమ్యతే।
ఇత్యుక్త్వా వృషమారుహ్య పార్వత్యా సహ శంకరః॥

"నేనిప్పుడు నీతోపాటు వృషభాన్ని అధిరోహించి బయలుదేరుతున్నాను" అన్నాడు. అలా పలికి శంకరుడు పార్వతితో సహా వృషభము నధిరోహించి...

- - - === - - -

09. యయౌ భూమండలం ద్రష్టుం గౌర్యాశ్చిత్రాణి దర్శయన్।
క్వచిత్ వింధ్యాచలప్రాంతే మహారణ్యే సుదుర్గమే॥

భూమండలం చూడబోయాడు. గౌరీదేవికి భూలోక వింతలు చూపిస్తూ, వింధ్యాచల పర్వత ప్రాంతంలో సుదుర్గమమైన మహారణ్యమునకు చేరుకున్నాడు.

- - - === - - -

10. తత్ర వ్యాహర్తుమాయాంతం భిల్లం పరశుధారిణం।
వర్ధ్యమానం మహావ్యాఘ్రం నఖదంష్ట్రాభిరావృతం॥

ఒకచోట వారికి గొడ్డలిని చేత ధరించిన ఒక కిరాతుడు కనిపించాడు. అతడు సమిధలు మొదలగునవి తీసికొని పోవుటకై ఆ అడవిలో తిరుగుచుండెను.

- - - === - - -

11. అతీవ చిత్రచారిత్ర్యం వజ్రకాయసమాయుతం।
అప్రయత్నమనాయాసం అఖిలం సుఖమాస్థితం॥

అతని శరీరము వజ్రము వలె ధృఢముగా నుండెను. ఇంతలో గొప్పవైన గోళ్ళు, కోరలూ ఉన్న ఒక పెద్దపులి ఆ కిరాతుని చంపబోవుచుండెను. అయితే చాలా వింత గొల్పెడు చరిత్రగల ఆ కిరాతుడు తనను రక్షించుకొనుటకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. అతనిలో దుఃఖములేదు. విచారము లేదు. పైగా సంతోషంతో నిర్భయముగా నిలబడి యుండెను.

- - - === - - -

12. పలాయితం మృగం పశ్చాద్ వ్యాఘ్రో భీత్యా పలాయతః।
ఏతదాశ్చర్యమాలోక్య పార్వతీ ప్రాహ శంకరం॥

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

తర్వాత (అదే సమయంలో) ఒక లేడి పరుగెత్తుతూ వచ్చింది. దానిని చూసి ఆ పెద్దపులి భయముతో పారిపోయినది. ఇట్టి వింతను చూచిన పార్వతి శంకరునితో...

\- - - === - - -

..శ్రీ పార్వత్యువాచ...

13. కిమాశ్చర్యం కిమాశ్చర్యం అగ్రే శంభో నిరీక్ష్యతాం।
ఇత్యుక్తః స తతః శంభుః దృష్ట్వా ప్రాహ పురాణవిత్॥

"ఏమాశ్చర్యం, ఏమాశ్చర్యం, శంభూ! ఎదురుగా చూడు" అన్నది. అలా అనేసరికి పురాణవేత్తయగు ఆ శంభుదేవుడు చూచి ఇట్లనెను.

\- - - === - - -

శ్రీ శంకర ఉవాచ

14. గౌరి వక్ష్యామి తే చిత్రం అవాఙ్మానసగోచరం।
అదృష్టపూర్వమస్మాభిః నాస్తి కించిన్న కుత్రచిత్॥

"గౌరీ! వాక్కులకూ, మనస్సుకూ అందని చోద్యం నీకు చెపుతాను. మేము చూడనిదంటూ ఏ కొంచెమూ ఎక్కడా లేదు"..

\- - - === - - -

15. మయా సమ్యక్ సమాసేన వక్ష్యతే శృణు పార్వతి।
అయం దూరశ్రవా నామ భిల్లః పరమ ధార్మికః॥

పార్వతీ! ఇప్పుడు దీనిని గూర్చి నేను చక్కగా సంగ్రహంగా చెపుతాను వినుము - ఈ భిల్లుని పేరు దూరశ్రవుడు. పరమధార్మికుడు.

\- - - === - - -

16. సమిత్కుశప్రసూనాని కందమూలఫలాదికం।
ప్రత్యహం విపినం గత్వా సమాదాయ ప్రయాసతః॥

ప్రతిరోజూ అడవికి వెళ్ళి కష్టపడి సమిధలూ, దర్భలూ, పుష్పాలు, కందమూల ఫలాదులూ తెచ్చి..

- - - === - - -

17. ప్రియే పూర్వం మునీంద్రేభ్యః ప్రయచ్ఛతి న వాంఛతి।
తేపి తస్మిన్నపి దయాం కుర్వతే సర్వమౌనినః॥

ముందు మునీంద్రులకిస్తాడు. ప్రతిఫలంగా తానేమీ కోరడు. ఆ మౌనులందరూ కూడా అతని పట్ల దయతో ఉంటారు..

- - - === - - -

18. దలాదనో మహాయోగీ వసన్నేవనిజాశ్రమే।
కదాచిదస్మరత్ సిద్ధం దత్తాత్రేయం దిగంబరం॥

అక్కడే దలాదనుడను ఒక మహాయోగి ఉన్నాడు. ఆయన తన ఆశ్రమంలో నివసిస్తూనే ఒకప్పుడు దిగంబరుడైన దత్తాత్రేయసిద్ధుని తలచుకొన్నాడు.

- - - === - - -

19. దత్తాత్రేయః స్మర్తృగామీ చేతిహాసం పరీక్షితుం।
తత్-క్షణాత్ సోపి యోగీంద్రః దత్తాత్రేయః సముత్థితః॥

దత్తాత్రేయుడు స్మర్తృగామి (తనను తలచుకొన్న వారివద్దకు వెడతాడు) అని విన్న కథను పరీక్షించటానికి అతడు దత్తాత్రేయుని స్మరించాడు. మరుక్షణంలోనే దత్తాత్రేయ యోగీంద్రుడు ప్రత్యక్షమయ్యాడు.

- - - === - - -

20. తం దృష్ట్వాశ్చర్యతోషాభ్యాం దలాదనమహామునిః।
సంపూజ్యాగ్రే విషీదంతం దత్తాత్రేయమువాచ తం॥

దలాదన మహాముని ఆయనను చూచి ఆశ్చర్య సంతోషాలతో పూజించాడు. ఎదుట కూర్చున్న ఆయనతో ఇట్లనెను -

– – – === – – –

21. మయోపహూతః సంప్రాప్తః దత్తాత్రేయ మహామునే।
స్మర్తృగామీ త్వమిత్యేతత్ కింవదంతీం పరీక్షితుం॥

ఓ దత్తాత్రేయ మహామునీ! నా ఆహ్వానం విని విచ్చేశావు. నీవు స్మర్తృగామివి అని జనులనుకొనే మాటను పరీక్షించాలని...

– – – === – – –

22. మయాద్య సంస్మృతోసి త్వం అపరాధం క్షమస్వ మే।
దత్తాత్రేయో మునిం ప్రాహ మమ ప్రకృతిరీదృశీ॥

నిన్నిపుడు స్మరించాను. నా అపరాధం క్షమించు" అన్నాడు. దత్తాత్రేయుడు ఆ మునితో ఇట్లు పలికెను. నా ప్రకృతి ఇటువంటిది.

– – – === – – –

23. అభక్త్యా వా సుభక్త్యా వా యః స్మరేన్మామనన్యధీః।
తదానీం తముపాగత్య దదామి తదభీప్సితం॥

భక్తి లేకుండి కానీ, మంచి భక్తి ఉండి గానీ, అన్యాలోచనలేకుండా నన్ను స్మరించిన వారివద్దకు వెళ్ళి వారు కోరినవి ఇస్తాను" అని చెప్పాడు.

– – – === – – –

24. దత్తాత్రేయో మునిం ప్రాహ దలాదనమునీశ్వరం।
యదిష్టం తద్వృణీష్వ త్వం యత్ ప్రాప్తోహం త్వయా స్మృతః॥

(మళ్ళీ) దత్తాత్రేయుడు ఆ దలాదనమునీశ్వరునితో "నీ కేది ఇష్టమయితే దానిని కోరుకో నీవు తలచుకొన్నందున వచ్చాను కదా" అన్నాడు.

- - - === - - -

25. దత్తాత్రేయం మునిః ప్రాహ మయా కిమపి నోచ్యతే।
త్వచ్చిత్తే యత్స్థితం తన్మే ప్రయచ్ఛ మునిపుంగవ॥

ఆ ముని దత్తాత్రేయునితో "ఓ మునిపుంగవా! నే నేమీ అడగను. నీ మనస్సులో నున్నది, నాకు శ్రేయస్కరమైనది యగు దానిని నాకు ప్రసాదింపుము" అన్నాడు.

- - - === - - -

శ్రీ దత్తాత్రేయ ఉవాచ...

26. మమాస్తి వజ్రకవచం గృహాణేత్యవదన్మునిం।
తథేత్యంగీకృతవతే దలాదనమునయే మునిః॥

శ్రీ దత్తాత్రేయుడు " నా వజ్రకవచము ఉన్నది. తీసుకో " అని మునితో అన్నాడు. అలాగే నని అంగీకరించాడు దలాదనముని. ఆయనకు...

- - - === - - -

27. స్వవజ్రకవచం ప్రాహ ఋషిచ్ఛందఃపురఃసరం।
న్యాసం ధ్యానం ఫలం తత్ర ప్రయోజనమశేషతః॥

- - - === - - -

ఆ ముని తన వజ్రకవచమునకు సంబంధించిన ఋషినీ, ఛందస్సునూ ముందుగా చెప్పి న్యాసం, ధ్యానం, దాని ప్రయోజనము అంతా వివరించి చెప్పాడు.

28. అస్య శ్రీదత్తాత్రేయ వజ్రకవచ స్తోత్ర మంత్రస్య, కిరాతరూపీ మహారుద్ర ఋషిః – అనుష్టుప్ ఛందః – శ్రీదత్తాత్రేయో దేవతా – ద్రాం బీజం – ఆం శక్తిః – క్రౌం కీలకం – ఓం ఆత్మనే నమః – ఓం ద్రీం మనసే నమః – ఓం ఆం ద్రీం శ్రీం సౌః, – ఓం క్లాం క్లీం క్లూం క్లైం క్లౌం క్లః – శ్రీదత్తాత్రేయ ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః॥

– – – === – – –

అథ కరన్యాసః..

ఓం ద్రాం అంగుష్ఠాభ్యాం నమః।
ఓం ద్రీం తర్జనీభ్యాం నమః।
ఓం ద్రూం మధ్యమాభ్యాం నమః।
ఓం ద్రైం అనామికాభ్యాం నమః।
ఓం ద్రౌం కనిష్ఠికాభ్యాం నమః।
ఓం ద్రః కరతలకరపృష్ఠాభ్యాం నమః॥

– – – === – – –

అథ హృదయాదిన్యాసః ..

ఓం ద్రాం హృదయాయ నమః।
ఓం ద్రీం శిరసే స్వాహా।
ఓం ద్రూం శిఖాయై వషట్।

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

ఓం ద్రైం కవచాయ హుం।
ఓం ద్రౌం నేత్రత్రయాయ వౌషట్।
ఓం ద్రః అస్త్రాయ ఫట్॥

\- - - === - - -

ఓం భూర్భువఃస్వరోమితి దిగ్బంధః॥

.. అథ ధ్యానం ..

29. జగదంకురకందాయ సచ్చిదానందమూర్తయే।
దత్తాత్రేయాయ యోగీంద్ర చంద్రాయ పరమాత్మనే॥

సంసారమను మహావృక్షమునకు మూలమైనట్టి వాడునూ, సచ్చిదానంద స్వరూపుడునూ, యోగీశ్వరులకు ఆనంద ప్రదాతయునైన చంద్రుడునూ, పరమాత్మ స్వస్వరూపుడునూ అయిన దత్తాత్రేయునికి నమస్కారము.

\- - - === - - -

30. కదా యోగీ కదా భోగీ కదా నగ్నః పిశాచవత్।
దత్తాత్రేయో హరిః సాక్షాత్ భుక్తి ముక్తి ప్రదాయకః॥

యోగి స్వరూపంలో ఒకసారి, భోగి వలె ఒకసారి, దిగంబరిగా ఒకప్పుడు, పిశాచం రూపంలో ఇంకొకప్పుడు, అటూ ఇటూ తిరుగుతుండే ఆ దత్తాత్రేయ మహాముని భోగికి భోగములూ, యోగిగా మోక్షము ప్రసాదించుటలో సర్వ సమర్థుడు అయిన ఆ శ్రీమన్నారాయణుడే.

\- - - === - - -

31. వారాణసీపురస్నాయీ కోల్హాపురజపాదరః।
మాహురీపురభిక్షాశీ సహ్యశాయీ దిగంబరః॥

ఈ దత్తాత్రేయుడు ప్రతిదినమూ ప్రత్యూషవేళ కాశీలోని గంగానదిలో స్నానమాచరించును. పిదప కోల్హాపురంలో మహాలక్ష్మి ఆలయంలో దేవీజపం చేస్తాడు. తరువాత మహురీపురం (నేటి మాహుర్ గఢ్) లో భిక్షాటనం చేస్తాడు. ఆ తరువాత సహ్యాద్రి పర్వతములలోని ఒక గుహలో దిగంబరుడై శయనిస్తాడు.

– – – === – – –

32. ఇంద్రనీలసమాకారః చంద్రకాంతిసమద్యుతిః।
వైడుర్యసదృశస్ఫూర్తిః చలత్కించిజ్జటాధరంః॥

శ్రీ దత్తుని శరీరం ఇంద్రనీలమణి కాంతితో ప్రకాశిస్తూ భస్మం పులుముకోబడి ఉంటుంది. అందుచేత చంద్రకాంత మణిలా తెల్లగా కూడా మెరుస్తుంటుంది. గాలికి ఊగే జటలు తలపై ఎరుపు నలుపూ కలిసిన వైఢూర్యముల వలె ప్రకాశిస్తూ ఉంటాయి.

– – – === – – –

33. స్నిగ్ధధావల్యయుక్తాక్షోత్యం తనీలకనీనికః।
భ్రూవక్షఃశ్మశ్రునీలాంకః సశాంకసదృశాననః॥

దత్తాత్రేయుని తెల్లని నయనములు వాత్సల్య స్ఫోరకములు. ఆయన కనుపాపలు చక్కని నీలవర్ణంలో ఉంటాయి. ఆయన మోము చంద్రబింబమును బోలియుంటుంది. కనుబొమ్మలవరకు పాకిన ఆయన గడ్డం నీలి వర్ణంలో ఉంటుంది.

– – – === – – –

34. హాసనిర్జితనీహారః కంఠనిర్జితకంబుకః।
మాంసలాంసో దీర్ఘబాహుః పాణినిర్జితపల్లవః॥

ఆయన నవ్వుల కాంతి పొగమంచు బిందువులను మించి మెరుస్తుంటుంది. కంఠం యొక్క అందం శంఖాన్ని సిగ్గిలేలా చేస్తుంది. వెన్ను (మూపురం) మాంసంతో నిండి పుష్టిగా ఉంటుంది. ఆయన బాహువులు దీర్ఘంగా ఉంటాయి. ఆయన అరచేతులు లేత చిగురాకుల కంటే కోమలంగా ఉంటాయి.

– – – === – – –

35. విశాలపీనవక్షాశ్చ తామ్రపాణిర్దలోదరః।
పృథులశ్రోణిలలితః విశాలజఘనస్థలః॥

దత్తాత్రేయుని ఛాతి విశాలముగా బలిష్టంగా ఉంటుంది. ఆయన నడుము లలితంగా, విశాలంగా ఉంటుంది. పిరుదులు కూడా విశాలంగా ఉంటాయి.

- - - === - - -

36. రంభాస్తంభోపమానోరుర్జానుపూర్వైకజంఘకః।
గూఢగుల్ఫః కూర్మపృష్ఠః లసత్పాదోపరిస్థలః॥

ఆయన తొడలు అరటి స్తంభములవలె ఉండుటయేగాక మోకాళ్ళ వరకు విస్తరించి ఉంటాయి. మోకాళ్ళూ పిక్కలూ మాంసంతో నిండి దృఢంగా ఉంటాయి. పైపాదములు తాబేలు యొక్క వీపు వలె ఉంటుంది. చీలమండలు గూఢముగా ఉంటాయి.

- - - === - - -

37. రక్తారవిందసదృశరమణీయపదాధరః।
చర్మాంబరధరో యోగీ స్మర్తృగామీ క్షణే క్షణే॥

దత్తాత్రేయుని అరికాళ్ళు అరుణ పద్మముల వలె ఎరుపురంగులో అతి కోమలంగా ఉంటాయి. శరీరంపై సదా మృగచర్మం వలువ వలె ధరిస్తుంటాడు. తన భక్తులు ఎప్పుడు ఎక్కడ మనస్ఫూర్తిగా స్మరిస్తే ఆయన తన యోగమహిమ చేత అప్పుడే అక్కడ ప్రత్యక్ష మవుతుంటాడు.

- - - === - - -

38. జ్ఞానోపదేశనీరతః విపద్ధరణదీక్షితః।
సిద్ధాసనసమాసీనః ఋజుకాయో హసన్ముఖః॥

ఆయన ఎల్లప్పుడూ జ్ఞానోపదేశ నిరతుడై యుంటాడు. భక్తులను దుఃఖ విముక్తులను చేయుటకు ఆయన నిబద్ధ దీక్షితులు. ఆయన తరచుగా సిద్ధాసనంలో నిటారుగా కూర్చుని ఉంటాడు. ఆయన ప్రసన్న ముఖం ఎప్పుడూ చిరునవ్వు చిందిస్తుంటుంది.

- - - === - - -

39. వామహస్తేన వరదః దక్షిణేనాభయంకరః।
బాలోన్మత్తపిశాచీభిః క్వచిద్యుక్తః పరీక్షితః॥

దత్తాత్రేయస్వామి తన ఎడమ చేతితో వరద (రక్షించె) ముద్రతోను, కుడి చేతితో అభయ ముద్రతోనూ కనిపిస్తారు. ఒకానొకప్పుడు బాలురతోనో, పిచ్చి వారితోనో లేక పిశాచములతోనో వారి వలెనే వారి నడుమనే ఉండి మనకు కనిపిస్తారు.

- - - === - - -

40. త్యాగీ భోగీ మహాయోగీ నిత్యానందో నిరంజనః।
సర్వరూపీ సర్వదాతా సర్వగః సర్వకామదః॥

ఆయన త్యాగి, భోగి, యోగి, మాయావిముక్తుడు, నిత్యానంద స్వరూపుడు, పరిపూర్ణజ్ఞానిగా ఉంటాడు. ఒకేసారి వివిధరూపములలో దర్శనమీయగల సమర్థుడు. సర్వగామిత్వం (ఎక్కడికి కావాలంటే అక్కడకు క్షణంలో వెళ్ళగల శక్తి) గలవాడు. సర్వకామదుడు (అందరి కోరికలు తీర్చగల సమర్థుడు). ఆ స్వామి సర్వదాత.

- - - === - - -

41. భస్మోద్ధూలితసర్వాంగః మహాపాతకనాశనః।
భుక్తిప్రదో ముక్తిదాతా జీవన్ముక్తో న సంశయః

దత్తాత్రేయుడు ఒంటినిండా భస్మం ధరించియుంటాడు. ఆయన దర్శనం చేతనే కాదు, స్మరించుట చేతనే (మనసారా) పాపములన్నీ నిర్మూలింప బడతాయి. భోగమూ మోక్షమూ రెంటినీ ప్రసాదించగల సమర్థుడు. ఆయన పరిపూర్ణమైన జీవన్ముక్తుడు అనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

- - - === - - -

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

42. ఏవం ధ్యాత్వానన్యచిత్తః మద్వజ్రకవచం పఠేత్।
మామేవ పశ్యన్సర్వత్ర స మయా సహ సంచరేత్॥

"ఎవరు ఈ విధముగా అనన్య భావంతో సర్వత్రా నన్నే దర్శిస్తూ, నన్నే ధ్యానిస్తూ, ఈ వజ్రకవచాన్ని పఠిస్తారో వారు జీవన్ముక్తులై సదానాతోనే సంచరిస్తారు" అని శ్రీ దత్తాత్రేయ మహాముని, దలాదనమునికి తెలిపారు.

– – – === – – –

43. దిగంబరం భస్మసుగంధలేపనం
చక్రం త్రిశూలం డమరుం గదాయుధం।
పద్మాసనం యోగిమునీంద్రవందితం
దత్తేతి నామస్మరణేన నిత్యం॥

దిగంబరుడు, భస్మసుగంధమును దాల్చిన వాడు, చక్రాయుధము, త్రిశూలము, డమరుకం, గద మొదలైన ఆయుధములను వరుసగా తన నాలుగు చేతులలో ధరించిన వాడు, పద్మాసనమున కూర్చుని యుండువాడు, యోగీశ్వరుడు, మునీంద్రులచే పూజింపబడు వాడు అయిన శ్రీ దత్తాత్రేయస్వామి నిత్యమూ నామజపంతో నిమగ్నమై యుంటాడు.

– – – === – – –

...అథ పంచోపచార పూజ...

44. ఓం లం పృథివీతత్త్వాత్మనే గంధం సమర్పయామి।
ఓం హం ఆకాశాత్మనే పుష్పైః పూజయామి।
ఓం యం వాయువాత్మనే ధూపమాఘ్రాపయామి।
ఓం రం వన్హ్యాత్మనే దీపం దర్శయామి।

ఓం వం అమృతతత్త్వాత్మనే అమృతం
మహానైవేద్యం నివేదయామి।

ఓం సం సర్వాత్మనే సర్వోపచార పూజాం సమర్పయామి।

- - - === - - -

... అథ అష్టోత్తరమ్...

45. " ఓం ద్రాం "

పంచోపచార పూజ అనంతరం 108 సార్లు " ఓం ద్రాం " అను బీజాక్షరములను జపించవలెను.

- - - === - - -

...అథ వజ్రకవచం...

46. ఓం దత్తాత్రేయః శిరః పాతు సహస్రాబ్జేషు సంస్థితః।
భాలం పాత్వానసూయేయః చంద్రమండలమధ్యగః॥

శ్రీ దత్తాత్రేయస్వామి తను సహస్రారకమలంలో ఉండి నా శిరస్సును రక్షించు గాక! అనసూయా దేవి పుత్రుడైన ఆ దత్తాత్రేయ భగవానుడు చంద్రమండలం మధ్య ప్రదేశమున యుండి నా ఫాల భాగమును కాపాడుగాక!

- - - === - - -

47. కూర్చం మనోమయః పాతు హం క్షం ద్విదలపద్మభూః।
జ్యోతిరూపోక్షిణీ పాతు పాతు శబ్దాత్మకః శ్రుతీ॥

" హం " " క్షం " అనే బీజాక్షర రూపమున నున్న రెండు దళములున్న పద్మమున నుండు (ఆజ్ఞా చక్రమున స్థితుడై యున్న) మనోమయుడు అయిన దత్తాత్రేయ భగవానుడు కూర్చాన్ని (ముక్కు మరియు కనుబొమల మధ్య ప్రదేశం) రక్షించుగాక! జ్యోతిరూపుడై

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

యున్న ఆ దత్త భగవానుడు నా కన్నులను, శబ్దాత్మకుడైన దత్తుడు నా కర్ణ ద్వయమును రక్షించుగాక!

- - - === - - -

48. నాసికాం పాతు గంధాత్మా ముఖం పాతు రసాత్మకః।
జిహ్వాం వేదాత్మకః పాతు దంతోష్ఠౌ పాతు ధార్మికః॥

గంధస్వరూపుడు నాసికను రక్షించుగాక! రసస్వరూపుడు నా ముఖాన్ని (నోటిని) కాపాడుగాక! వేదస్వరూపుడు నా నాలుకను కాపాడుగాక! ధర్మస్వరూపుడు నా దంతాలను రెండు పెదవులను కాపాడుగాక!

- - - === - - -

49. కపోలావత్రిభూః పాతు పాత్వశేషం మమాత్మవిత్।
స్వరాత్మా షోడశారాబ్జస్థితః స్వాత్మావతాద్గలం॥

అత్రిమహాముని సుపుత్రుడైన దత్తగురువు నా చెక్కిళ్ళను రక్షించుగాక! ఆ దత్తస్వామి నా ఆత్మరూపుడై నా శరీరాన్నంతటినీ కాపాడుగాక! విశుద్ధ చక్రస్థితుడై పదహారు దళముల పద్మమున ఉండు స్వరస్వరూపుడైన దత్తాత్రేయ స్వామి నిజాత్మ స్వరూపుడై నా కంఠ సీమను రక్షించుగాక!

- - - === - - -

50. స్కంధౌ చంద్రానుజః పాతు భుజౌ పాతు కృతాదిభూః।
జత్రుణీ శత్రుజిత్ పాతు పాతు వక్షఃస్థలం హరిః॥

చంద్రుని తమ్ముడైన దత్తాత్రేయుడు నా రెండు భుజములను కాపాడుగాక! సత్యయుగం ప్రారంభంలో జన్మించిన దత్తభగవానుడు నా భుజద్వయమును రక్షించుగాక! శత్రువులను ఓడించు దత్తాత్రేయుడు నా జత్రువులను (భుజము మెడ మధ్య నున్న ఎముకలను) సంరక్షించుగాక! శ్రీహరి అవతారమైన దత్తుడు నా వక్షస్థలమును రక్షించుగాక!

- - - === - - -

51. కాదిఠాంతద్వాదశారపద్మగో మరుదాత్మకః।
యోగీశ్వరేశ్వరః పాతు హృదయం హృదయస్థితః॥

" అనాహత " చక్రస్థితుడై " క " కారం నుండి " ఠ " కారం వరకు గల పన్నెండు దళములున్న పద్మంలో యున్న శ్రీ దత్త భగవానుడు నా హృదయంలో నిండి యున్న వాయు రూపుడై నా హృదయాన్ని రక్షించుగాక!

- - - === - - -

52. పార్శ్వే హరిః పార్శ్వవర్తీ పాతు పార్శ్వస్థితః స్మృతః।
హఠయోగాదియోగజ్ఞః కుక్షిం పాతు కృపానిధిః॥

స్మర్తృగామిగా, పార్శ్వవర్తిగా ఉండే భగవత్స్వరూపుడైన దత్తాత్రేయుడు నా పార్శ్వ భాగమును సంరక్షించు గాక! హఠయోగం మొదలైన అన్ని యోగ విద్యలనూ గ్రహించిన దయాళువు అయిన శ్రీదత్తాత్రేయుడు నా ఉదరమును కాపాడుగాక!

- - - === - - -

53. డకారాదిఫకారాంతదశారసరసీరుహే।
నాభిస్థలే వర్తమానో నాభిం వహ్న్యాత్మకోఽవతు॥

శ్రీ దత్తాత్రేయుడు ' డ ' కారము నుండి 'ఫ ' కారం వరకూ గల పదిదళములున్న పద్మస్థితుడునూ అగ్ని తత్త్వము కలవాడునూ నాభియందుండు మణిపూరక చక్రంలో స్థితుడై అగ్నిస్వరూపుడైన యోగి దత్తాత్రేయుడు మణీపూరచక్ర సహితంగా నా నాభిని రక్షించుగాక!

- - - === - - -

54. వహ్నితత్త్వమయో యోగీ రక్షతాన్మణిపూరకం।
కటిం కటిస్థబ్రహ్మాండవాసుదేవాత్మకోఽవతు॥

వహ్నితత్త్వమయుడయిన యోగి మణిపూరకాన్ని రక్షించుగాక! తన నడుము భాగంలో బ్రహ్మాండమంతా కలిగిన దత్తుడు వాసుదేవ స్వరూపియై నా నడుమును రక్షించుగాక!

- - - === - - -

55. బకారాదిలకారాంతషట్పత్రాంబుజబోధకః।
జలతత్త్వమయో యోగీ స్వాధిష్ఠానం మమావతు॥

' బ ' కారం నుండి ' ల ' కారం వరకు గల ఆరు దళముల పద్మమున ఆ దత్తాత్రేయుడు జలతత్వ రూపుడు. అట్టి ఆ భగవానుడు నా స్వాధిష్ఠాన చక్రాన్ని రక్షించు గాక!

- - - === - - -

56. సిద్ధాసనసమాసీన ఊరూ సిద్ధేశ్వరోవతు।
వాదిసాంతచతుష్పత్రసరోరుహనిబోధకః॥

సిద్ధేశ్వరుడైన ఆ దతాత్రేయుడు సిద్ధాసనం వేసుకొని కూర్చున్న వాడై నా రెండు తొడలను రక్షించుగాక! 'వ' కారము నుండి 'స' కారము వరకు గల నాలుగు దళముల పద్మములో మహీరూపుడు...

- - - === - - -

57. మూలాధారం మహీరూపో రక్షతాద్వీర్యనిగ్రహీ।
పృష్ఠం చ సర్వతః పాతు జాన్వ్యన్యస్తకరాంబుజః॥

అఖండ నిష్టగల బ్రహ్మచారి అయిన దత్తుని నా మూలాధార చక్రాన్ని కాపాడుగాక! మోకాళ్ళ మీదకు హస్తకమలములను ఉంచుకొని కూర్చున్న దత్తాత్రేయుడు నా వీపును అన్ని వైపులనుండి సంరక్షించుగాక!

- - - === - - -

58. జంఘే పాత్వవధూతేంద్రః పాత్వంఘ్రీ తీర్థపావనః।
సర్వాంగం పాతు సర్వాత్మా రోమాణ్యవతు కేశవః॥

అవధూతలలో సర్వోన్నతుడైన దత్తాత్రేయుడు నాయొక్క రెండు "పిక్కల" ను రక్షించుగాక! తీర్థ పావనుడై తీర్థములనన్నింటినీ పునీతము చేయు ఆ మునిశ్రేష్ఠుడు నా పాదములకు కాపాడుగాక! సర్వాత్మకుడైన దత్తగురు మూర్తి నా సర్వాంగములను రక్షించుగాక! విచిత్రమైన కేశములుగల ఆ కేశవుడు నారోమములను కాపాడుగాక!

- - - === - - -

59. చర్మ చర్మాంబరః పాతు రక్తం భక్తిప్రియోవతు।
మాంసం మాంసకరః పాతు మజ్జాం మజ్జాత్మకోవతు।

శ్రీ దత్తాత్రేయస్వామి మృగచర్మ ధారియై నా చర్మమును సంరక్షించుగాక! భక్త వత్సలుడైన దత్తుడు నా దేహంలోని రక్తమును రక్షించు గాక! మాంసమును పెంపొందింప చేయగల దత్తస్వామి నా మాంసమును వృద్ధి చేయుగాక! నా మజ్జా స్వరూపుడగు ఆ మునివర్యుడు నాయొక్క మజ్జా ధాతువునకు రక్షయగుగాక!

- - - === - - -

60. అస్థీని స్థిరధీః పాయాన్మేధాం వేధాః ప్రపాలయేత్।
శుక్రం సుఖకరః పాతు చిత్తం పాతు దృఢాకృతిః॥

శ్రీదత్తాత్రేయస్వామి స్థిర బుద్ధి గలవాడై నా ఎముకలను, బ్రహ్మస్వరూపుడై నా మేధస్సును, సంరక్షించుగాక! దత్తభగవానుడు సుఖప్రదాతయై నా శుక్రాన్ని (తేజస్సు అని భావం), దృఢ వజ్రకాయుడు దత్తప్రభువు నా చిత్తమును రక్షించు గాక!

- - - === - - -

61. మనోబుద్ధిమహంకారం హృషీకేశాత్మకోవతు।
కర్మేంద్రియాణి పాత్వీశః పాతు జ్ఞానేంద్రియాణ్యజః॥

హృషీకములకు (ఇంద్రియములకు) ప్రభువైన దత్తాత్రేయస్వామి నా మనస్సును, బుద్ధినీ, అహంకారాన్నీ రక్షించుగాక! ఈశ్వరుడైన ఆ స్వామి నా కర్మేంద్రియములను కాపాడు గాక! శ్రీ దత్తాత్రేయుడు ఆజన్మ భగవానుడై నా జ్ఞానేంద్రియములను సంరక్షించుగాక!

- - - === - - -

62. బంధూన్ బంధూత్తమః పాయాచ్ఛత్రుభ్యః పాతు శత్రుజిత్।
గృహారామధనక్షేత్రపుత్రాదీంఛంకరోవతు॥

బంధుజనులలో సర్వశ్రేష్ఠుడైన దత్త స్వామి నాయొక్క బంధుకోటిని రక్షించుగాక! శత్రు విజేతయైన దత్తాత్రేయుడు నన్ను నా శత్రువుల నుండి కాపాడు గాక! శంకర భగవానుని అవతారమైన దత్త ప్రభువు నా గృహమును, క్షేత్రములను, తోటలను, ధన సంపత్తినీ, పుత్రాదులను సంరక్షించుగాక!

- - - === - - -

63. భార్యాం ప్రకృతివిత్ పాతు పశ్వాదీన్పాతు శార్ఙ్గభృత్।
ప్రాణాన్పాతు ప్రధానజ్ఞో భక్ష్యాదీన్పాతు భాస్కరః॥

ప్రకృతి తత్వమును బాగుగా నెరిగిన దత్తాత్రేయుడు నా భార్యను, శాస్త్రపాణి విష్ణు దేవుని అవతారమైన ఆ దత్త భగవానుడు నాయొక్క పశు సంపదను, సంరక్షించు గాక! ప్రధానమైన తత్త్వ రహస్యముల నెరిగిన ఆ యోగీశ్వరుడు నా ప్రాణములను, సూర్యసదృశుడైన దత్త భగవానుడు నా భోజన పదార్థములను చెడు దృష్టి నుంచి విష కలుషితముల నుంచి కాపాడు గాక!

- - - === - - -

64. సుఖం చంద్రాత్మకః పాతు దుఃఖాత్ పాతు పురాంతకః।
పశూన్పశూపతిః పాతు భూతిం భూతేశ్వరో మమ॥

చంద్రాత్మకుడైన దత్తాత్రేయుడు నాయొక్క సుఖములను రక్షించుగాక! త్రిపురాంతకుడైన మహేశ్వరుని స్వరూపుడైన దత్తమునీంద్రుడు నా దుఃఖములన్నిటిని దీర్చి నన్ను కాపాడుగాక! పశుపతి శంకరుని అవతారమైన దత్తుడు నా పశువులను, భూతనాధుడైన ఆస్వామి నా ఐశ్వర్యములను, యోగ సిద్ధులను సంరక్షించుగాక!

- - - === - - -

65. ప్రాచ్యాం విషహరః పాతు పాత్వాగ్నేయ్యాం మఖాత్మకః।
యామ్యాం ధర్మాత్మకః పాతు నైరృత్యాం సర్వవైరిహృత్॥

విషాణ్ని హరింపచేసి విషాన్ని సేవించిన శివరూపి దత్తాత్రేయుడు తూర్పు దిక్కుననూ, ఆ యజ్ఞస్వరూపుడు ఆగ్నేయదిక్కుననూ నన్ను రక్షించుగాక! ధర్మాత్ముడైన దత్తుడు దక్షిణ దిక్కుననూ, సర్వ వైరిహృత్తుడై శత్రునివారకుడైన దత్తస్వామి నైరృతిమూల యందు నన్ను సంరక్షించుగాక!

- - - === - - -

66. వరాహః పాతు వారుణ్యాం వాయవ్యాం ప్రాణదోవతు।
కౌబేర్యాం ధనదః పాతు పాత్వైశాన్యాం మహాగురుః॥

వరాహరూపంలో సంచరించే దత్త ప్రభువు నన్ను పడమటి దిక్కున రక్షించుగాక! నాసికామార్గం గుండా ప్రాణ వాయువును పంపి ప్రాణములనిచ్చి రక్షించు దత్తాత్రేయుడు వాయువ్య దిశలో నన్ను కాపాడు గాక! ధనదుడు కుబేరుని రూపంలో దత్తాత్రేయస్వామి ఉత్తర దిక్కున నన్ను రక్షించుగాక! జగద్గురువు శివుని రూపుడైన దత్తుడు ఈశాన్య దిక్కున నన్ను కాపాడు గాక!

- - - === - - -

67. ఊర్ధ్వం పాతు మహాసిద్ధః పాత్వధస్తాజ్జటాధరః।
రక్షాహీనం తు యత్స్థానం రక్షత్వాదిమునీశ్వరః॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

మహా సిద్ధ స్వరూపుడైన దత్తాత్రేయుడు నా ఊర్ధ్వ దిక్కును, జడలను ధరించు దత్తయోగీశ్వరుడు అధోదిశయందునూ నన్ను సంరక్షించు గాక! ఆది మునీంద్రుడైన శ్రీ దత్తాత్రేయ స్వామి రక్షలేని ఏ దిక్కు నుంచి అయిన నన్ను పరిపాలించి సంరక్షించు గాక!

- - - === - - -

...మాలా మంత్రము...

68. ఓం నమో భగవతే దత్తాత్రేయాయ।
స్మరణ మాత్ర సంతుష్టాయ। మహాభయ నివారణాయ।
మహాజ్ఞానప్రదాయ। చిదానందాత్మనే।
బాలోన్మత్త పిశాచవేషాయ। మహాయోగినే। అవధూతాయ।
అనఘాయ। అనసూయానంద వర్ధనాయ। అత్రిపుత్రాయ।
సర్వకామఫలప్రదాయ। భవబంధవిమోచనాయ।
ఆం ఆసాధ్యసాదనాయ। హ్రీం విభూతిదాయ।
క్రోం సాధ్యాకర్షణాయ। ఐం వాక్ప్రదాయ।
క్లీం జగత్త్రయ వశీకరణాయ।
సౌః సర్వమనః సంక్షోభణాయ।
శ్రీం మహాసంపత్ప్రదాయ।
గ్లౌం భూమండలాధిపత్యప్రదాయ।
ద్రాం చిరంజీవినే। వషట్ వశీకురు వశీకురు।
వౌషట్ ఆకర్షయ ఆకర్షయ। హుం విద్వేషయ విద్వేషయ।
ఫట్ ఉచ్చాటయ ఉచ్చాటయ। ఠః ఠః స్తంభయ స్తంభయ।

ఖేం ఖేం మారయ మారయ। నమస్సంపన్నాయ సంపన్నాయ।
స్వాహా పోషయ పోషయ। చిత్తం తోషయ తోషయ।
దారిద్ర్యం విద్రావయ విద్రావయ। దేహం పోషయ పోషయ।
పరమంత్ర యంత్ర తంత్రాణి ఛింది ఛింది।
గ్రహాన్ నివారయ నివారయ। వ్యాధీన్ నాశయ నాశయ।
దుఃఖం హర హర। సర్వమంత్ర స్వరూపాయ।
సర్వతంత్ర స్వరూపాయ। సర్వ యంత్ర స్వరూపాయ।
ఓం నమో యోగినే మహాసిద్ధిదాయ స్వాహా।

– – – === – – –

...అథ హృదయాది న్యాసః...

69. ఓం ద్రాం హృదయాయ నమః
ఓం ద్రీం శిరసే స్వాహా।
ఓం ద్రూం శిఖాయై వషట్।
ఓం ద్రైం కవచాయ హుం।
ఓం ద్రౌం నేత్రత్రయాయ వౌషట్।
ఓం ద్రః అస్త్రాయ ఫట్।

ఓం భూర్భువస్సువరోమితి దిగ్విమోకః।

...ఫలశ్రుతిః...

70. ఏతన్మే వజ్రకవచం యః పఠేచ్ఛృణుయాదపి।
వజ్రకాయశ్చిరంజీవీ దత్తాత్రేయోహమబ్రువం॥

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

శ్రీ దత్తాత్రేయస్వామి యొక్క ఈ వజ్రకవచాన్ని ఎవడు పరిపూర్ణ భక్తి నిష్ఠలతో పఠిస్తాడో అతడు వజ్రకాయుడై సంపూర్ణ ఆరోగ్యంతో దీర్ఘాయుర్దాయం కలవాడై జీవిస్తాడు. దత్తాత్రేయుణ్ణి అయిన నేను స్వయంగా చెబుతున్న మాటలివి.

- - - === - - -

71. త్యాగీ భోగీ మహాయోగీ సుఖదుఃఖవివర్జితః।
సర్వత్రసిద్ధసంకల్పః జీవన్ముక్తోద్య వర్తతే॥

అంతేగాక అట్లుచేసిన వాడు నాతో సమానమైన త్యాగి, భోగి, యోగి అవుతాడు. దుఃఖాతీతుడవుతాడు. అతని సంకల్పాలు సర్వదా, సర్వత్రా సిద్ధిస్తాయి. అటువంటివాడే సిద్ధ సంకల్పుడు. అతడు జీవన్ముక్తుడు. అని చెప్పాడు స్వామి.

- - - === - - -

72. ఇత్యుక్త్వాంతర్దధే యోగీ దత్తాత్రేయో దిగంబరః।
దలాదనోపి తజ్జప్త్వా జీవన్ముక్తః స వర్తతే॥

ఈ విధంగా పలికిన అవధూతాగ్రణి దత్తాత్రేయుడు అంతర్ధానమయ్యాడు. అంత దలాదన మహాముని కూడా ఈ వజ్ర కవచాన్ని జపించి దత్త గురుదేవుని వలెనే జీవన్ముక్తుడై ఇప్పటికీ ఉన్నాడు.

- - - === - - -

73. భిల్లో దూరశ్రవా నామ తదానీం శ్రుతవానిదం।
సకృచ్ఛ్రవణమాత్రేణ వజ్రాంగోభవదప్యసౌ॥

అదే సమయంలో దూరశ్రవుడనే బోయవాడు ఈ స్తోత్రాన్ని దూరం నుంచే విన్నాడు. ఆ విధంగా ఒక్క పర్యాయం వినుట చేతనే అతని శరీరం " వజ్రకాయం " అయింది.

- - - === - - -

74. ఇత్యేతద్వజ్రకవచం దత్తాత్రేయస్య యోగినః।
శ్రుత్వాశేషం శంభుముఖాత్ పునరప్యాహ పార్వతీ॥

ఈ విధముగా దత్తాత్రేయ యోగీశ్వరుని వజ్రకవచమంతా శంకరుని వలన విన్న పార్వతీదేవి ఆయనను తిరిగి ఇలా ప్రశ్నించింది. తమరు దయా సముద్రులై సవివరంగా నాకు ఈ దత్త వజ్రకవచము గురించి చెప్పితిరి.

- - - === - - -

... పార్వత్యువాచ ...

75. ఏతత్కవచమాహాత్మ్యం వద విస్తరతో మమ।
కుత్ర కేన కదా జాప్యం కిం యజాప్యం కథం కథం॥
ఉవాచ శంభుస్తత్సర్వం పార్వత్యా వినయోదితం॥

ఇప్పుడు నాకు ఈ జపం చేయుటకు యోగ్యులెవరు? దీనిని ఎక్కడ ఏ విధంగా ఎప్పుడు జపించాలి? ఆ సమాచారం తెలిపి నన్ను ధన్యురాలిని చేయండి అన్నది. దానికి శంకరుడిలా అన్నాడు.

- - - === - - -

... శ్రీ శివ ఉవాచ ...

76. శ్రుణు పార్వతి వక్ష్యామి సమాహితమనావిలం।
ధర్మార్థకామమోక్షాణామ్ ఇదమేవ పరాయణం॥

పార్వతీ దేవీ! నీ సందేహాలకు సమాధానం వినుము. ఈ స్తోత్ర పారాయణ చేతనే ధర్మార్థకామ మోక్షములు సిద్ధిస్తాయి.

- - - === - - -

77. హస్త్యశ్వరథపాదాతి సర్వైశ్వర్యప్రదాయకం।
పుత్రమిత్రకలత్రాది సర్వసంతోషసాధనం॥

రథ, గజ, తురగ వాహనయోగ్యత కలుగుతుంది. సకలైశ్వర్యములు ప్రాప్తిస్తాయి. పుత్ర, కళత్ర, మిత్ర సౌఖ్యమే గాక భగవదానందమైన పరతత్వం అనగా బ్రహ్మానందం సిద్ధిస్తుంది.

- - - === - - -

78. వేదశాస్త్రాది విద్యానాం నిధానం పరమం హి తత్।
సంగీతశాస్త్రసాహిత్య సత్కవిత్వవిధాయకం॥

ఇది వేద, జ్ఞాన విజ్ఞాన నిధి. సంగీతశాస్త్రము, అలంకార శాస్త్రము, కావ్య నిర్మాణ శక్తి ఉత్తమ కవిత్వజ్ఞానం కలుగుతాయి.

- - - === - - -

79. బుద్ధివిద్యాస్మృతిప్రజ్ఞామ్ అతిప్రౌఢిప్రదాయకం।
సర్వసంతోషకరణం సర్వదుఃఖనివారణం॥

శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ, అర్థవిజ్ఞానం, తత్త్వ విజ్ఞానం అనే ఆరు గుణాలు గల బుద్ధిని, విద్యను, తలపును, ప్రజ్ఞను, మతిని, నేర్పును యిస్తుంది. ఇది సర్వసంతోషాలను కలిగిస్తుంది. సర్వ దుఃఖాలను నివారిస్తుంది.

- - - === - - -

80. శత్రు సంహారకం శీఘ్రం యశఃకీర్తివివర్ధనం।
అష్టసంఖ్యా మహారోగాః సన్నిపాతాస్త్రయోదశ॥

శత్రువులను శీఘ్రమే సంహరిస్తుంది. యశస్సునూ, కీర్తిని పెంచుతుంది. ఈ కవచమును వెయ్యిసార్లు పఠించిన ఎనిమిది రకములైన మహారోగములు నశిస్తాయి.

- - - === - - -

81. షణ్ణవత్యక్షిరోగాశ్చ వింశతిర్మేహరోగకాః।
అష్టాదశతు కుష్ఠాని గుల్మాన్యష్టవిధాన్యపి॥

పదమూడు విధములైన జ్వరములు, తొంబై ఆరు రకములైన నేత్రరోగములు, ఇరవై రకములైన మేహ రోగములు, పద్దెనిమిది రకముల కుష్ఠ రోగములు, ఎనిమిది విధములైన శూలరోగములు..

- - - === - - -

82. అశీతిర్వాతరోగాశ్చ చత్వారింశత్తు పైత్తికాః।
వింశతిశ్లేష్మరోగాశ్చ క్షయచాతుర్థికాదయః॥

ఎనభై రకముల వాతములు, నలభై పైత్య రోగములు, ఇరవై రకముల శ్లేష్మ సంబంధ రోగములు నశించిపోతాయి. క్షయరోగం నివారించ బడుతుంది. చాతుర్థిక జ్వరాలు, మంత్ర, తంత్ర, యంత్రముల వల్ల వచ్చు జ్వరములు నివారింప బడతాయి.

- - - === - - -

83. మంత్రయంత్రకుయోగాద్యాః కల్పతంత్రాదినిర్మితాః।
బ్రహ్మరాక్షసవేతాలకూష్మాండాది గ్రహోద్భవాః॥

కుయోగాదులు కల్పతంత్రం వల్ల వచ్చే జ్వరాలు నశించి పీడలు తొలిగిపోతాయి. ఇవే కాక భూత, ప్రేత, రాక్షస, కూష్మాండ ఆదిగా గల గ్రహాలవల్ల కలిగే ప్రకోపాలు (మనం ఈ కాలంలో పిచ్చి పట్టింది అనుకుంటుంటాం), గ్రహచారం కొద్దీ ప్రాప్తించే విపత్తులు, అనేక అంటురోగాలు..

- - - === - - -

84. సంగజా దేశకాలస్థాః తాపత్రయసముత్థితాః।
నవగ్రహసముద్భూతాః మహాపాతక సంభవాః॥

విభిన్న కాలంలో విభిన్న దేశస్థుల నుండి సంక్రమించే శీతజ్వరాలు, ఆధ్యాత్మిక ఆధి దైవిక, ఆధి భౌతిక తాపములు అన్నీ హరింపబడతాయి.

- - - === - - -

85. సర్వే రోగాః ప్రణశ్యంతి సహస్రావర్తనాద్ధ్రువం।
అయుతావృత్తిమాత్రేణ వంధ్యా పుత్రవతీ భవేత్॥

ఈ కవచం వేయి మార్లు పఠించిన నవగ్రహాల దుష్ట చలనం వల్ల కలిగే రోగములు, దుఃఖములు నిస్సందేహంగా తొలగిపోతాయి. దీనిని పదివేల మార్లు పఠించిన నిస్సంతులు పుత్రప్రాప్తి నొందెదరు.

– – – === – – –

86. అయుతద్వితయావృత్త్యా హ్యపమృత్యుజయో భవేత్।
అయుతత్రితయాచ్చైవ ఖేచరత్వం ప్రజాయతే॥

ఇరవై వేల సార్లు పఠించిన అకాల మృత్యువు తొలగిపోవును. ముప్పది వేలసార్లు ఈ కవచము పఠించిన ఆకాశగమన శక్తి సిద్ధించును.

– – – === – – –

87. సహస్రాదయుతాదర్వాక్ సర్వకార్యాణి సాధయేత్।
లక్షావృత్త్యా కార్యసిద్ధిః భవత్యేవ న సంశయః॥

లక్షమారులు జపిస్తే సర్వకార్యాలు సాధ్యమవుతాయి. లక్షసార్లు పారాయణ చేసిన వారికి సర్వ వాంఛలు సిద్ధిస్తాయి. సంశయం లేదు.

– – – === – – –

88. విషవృక్షస్య మూలేషు తిష్ఠన్ వై దక్షిణాముఖః।
కురుతే మాసమాత్రేణ వైరిణం వికలేంద్రియం॥

విషవృక్షం క్రింద దక్షిణాముఖంగా కూర్చుని ఈ వజ్రకవచమును ఒక నెల పాటు జపించిన వారికి వారి శత్రువులు వికలాంగులై వారిని పీడించరు.

– – – === – – –

89. ఔదుంబరతరోర్మూలే వృద్ధికామేన జాప్యతే।
శ్రీవృక్షమూలే శ్రీకామీ తింత్రిణీ శాంతికర్మణి॥

ఔదుంబా వృక్షము క్రింద (మేడి చెట్టు క్రింద) జపించిన ధన, ధాన్య సమృద్ధియు, బిల్వ వృక్షం (మారేడు చెట్టు) క్రింద పఠించిన లక్ష్మీప్రాప్తియు, తింత్రిణీ వృక్షం (చింత చెట్టు) క్రింద పఠించిన ఉపద్రవాలనుంచి శాంతియు లభింపచేస్తుంది.

– – – === – – –

90. ఓజస్కామోశ్వత్థమూలే స్త్రీకామైః సహకారకే।
జ్ఞానార్థీ తులసీమూలే గర్భగేహే సుతార్థిభిః॥

ఈ వజ్రకవచ పారాయణం అశ్వత్థవృక్షం (రావి చెట్టు) క్రింద పఠిస్తే తేజస్సు, ఓజస్సు కలుగుతాయి. కొత్త మామిడి చెట్టు క్రింద పఠించిన వారికి వివాహం జరుగుతుంది. తులసి చెట్టు క్రింద పఠించిన వారికి జ్ఞానప్రాప్తి కలుగుతుంది. గర్భగుడిలో నిష్టతో కూర్చుని ఈ కవాచాన్ని పఠిస్తే పుత్ర సంతానం కలుగుతుంది.

– – – === – – –

91. ధనార్థిభిస్తు సుక్షేత్రే పశుకామైస్తు గోష్ఠకే।
దేవాలయే సర్వకామైః తత్కాలే సర్వదర్శితం॥

ధనార్థులు పుణ్యక్షేత్రాలలోనూ, పశు సమృద్ధికోరు వారు గోశాలలోనూ, దేవాలయములో కూర్చుని దీనిని పఠించిన ఏ కోరికైనా తత్కాల సిద్ధి పొందుతుంది.

– – – === – – –

92. నాభిమాత్రజలే స్థిత్వా భానుమాలోక్య యో జపేత్।
యుద్ధే వా శాస్త్రవాదే వా సహస్రేణ జయో భవేత్॥

నదులలోను, చెరువులలోను బొడ్డులోతు నీటిలో నిలిచి సూర్య సందర్శన చేస్తూ వేయి పర్యాయములు పఠించిన క్షత్రియులు యుద్ధాలలోను, శాస్త్ర వాదనలో పండితులు, వివాదములలో సర్వులునూ జయించెదరు.

- - - === - - -

93. కంఠమాత్రే జలే స్థిత్వా యో రాత్రౌ కవచం పఠేత్।
జ్వరాపస్మారకుష్ఠాది తాపజ్వరనివారణం॥

కంఠంలోతు నీళ్ళల్లో నిలబడి రాత్రివేళ దీనిని పఠించిన వారికి అపస్మారం, కుష్ఠు వంటి వ్యాధులు తిరో ముఖంపడతాయి.

- - - === - - -

94. యత్ర యత్స్యాత్స్థిరం యద్యత్ ప్రసన్నం తన్నివర్తతే।
తేన తత్ర హి జప్తవ్యం తతః సిద్ధిర్భవేద్ధ్రువం॥

ఏది ఎక్కడ స్థిరంగా ఉంటుందో, ఏది యేది ప్రసన్నమైతే అది తొలగుతుందో అక్కడ జపిస్తే దానివల్ల సిద్ధి కలుగుతుంది. ఇది నిశ్చయం.

- - - === - - -

95. ఇత్యుక్త్వాన్ శివో గౌర్యై రహస్యం పరమం శుభం।
యః పఠేత్ వజ్రకవచం దత్తాత్రేయ సమో భవేత్॥

అని శివుడు శుభప్రదమైన పరమ రహస్యాన్ని గౌరికి చెప్పాడు. ఈ వజ్రకవచాన్ని పఠించినవారు దత్తాత్రేయ సమానులవుతారు.

- - - === - - -

96. ఏవం శివేన కథితం హిమవత్సుతాయై।
ప్రోక్తం దలాదమునయేత్రిసుతేన పూర్వం॥

ఈ విధంగా పూర్వం అత్రిసుతుడగు దత్తాత్రేయుడు దలాదమునికి చెప్పినది, తదుపి హిమవత్సుతయగు పార్వతీదేవికి శివుడు చెప్పెను.

- - - === - - -

97. యః కోపి వజ్రకవచం పఠతీహ లోకే।
దత్తోపమశ్చరతి యోగివరశ్చిరాయుః॥

ఈ వజ్రకవచమును పఠించినవాడు ఈ లోకంలో దత్తునివలె యోగివరుడు చిరాయుష్మంతుడు అయి సంచరిస్తాడు.

98. ఇతి శ్రీరుద్రయామలే హిమవత్ఖండే (మంత్రశాస్త్రే ఉపాసనాఖండే శివవిజయసిద్ధాంతే ఉమామేశ్వరసంవాదే) శ్రీదత్తాత్రేయ వజ్రకవచ స్తోత్రం సంపూర్ణం.

ఈ విధముగా రుద్రయామళాంతర్గతంగా మంత్ర శాస్త్ర, రూపమైన హిమవత్ ఖండంలోని ఉమా మహేశ్వర సంవాద రూపములో ఉన్న ఈ దత్తాత్రేయ వజ్ర కవచ స్తోత్రము సర్వము సంపూర్ణము.

99. ఓం సర్వం శ్రీ దత్తాత్రేయార్పణమస్తు॥
ఓం శ్రీ దత్తాత్రేయ పరబ్రహ్మణే నమః॥

- - ఇతి శ్రీ దత్త వజ్ర కవచం సంపూర్ణమ్ - -

- - - === - - -

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

Kiron Type Institute




(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. –944 044 9650, 994 994 1430)